అభివృద్ధి పనులు పరిశీలించిన ఈఈ

విశాలాంధ్ర-సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామివారి దేవస్థానం ఇన్‌చార్జ్ కార్యనిర్వహక ఇంజినీర్ (ఈఈ) రామక్రిష్ణ కొండపై జరుగుతున్న వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న పనులను పర్యవేక్షించారు. స్వామివారి ఉత్తర రాజగోపురం ఎదురుగా వార్షిక కళ్యాణం, పలు ఉత్సవ కార్యక్రమాలు శాశ్వత షెడ్ నిర్మాణ పనులు పరిశీలించి ఏఈఈ రవిరాజ్, తిరుమల, వర్క్ ఇన్స్పెక్టర్ రవిలకు ఈఈ పలు సూచనలు చేశారు. అదేవిధంగా కొండ మీద, కొండ దిగువ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పనులు పరిశీలించారు.

వసూళ్లలో 'మహా' దిట్ట ఆ పీఏ ?

జీవీఎంసీలో షాడో నేతగా చక్రం తిప్పుతున్న వైనం
బిల్లుల్లో కమిషన్లు, అక్రమ నిర్మాణాలపై వసూళ్లు
ప్రతి పనికి ఓ రేటుతో బెంబేలెత్తిపోతున్న కాంట్రాక్టర్లు, అధికారులు

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న సామెత చక్కగా పాటిస్తూ, రెండు చేతుల దండిగా దండుకుంటున్న ఆ పీఏ వైఖరిపై జీవీఎంసీలో అందరూ తీవ్రస్థాయిలో చర్చించుకుంటున్నారు. జీవీఎంసీలో ఆ కీలక నేతకు సరైన విషయ పరిజ్ఞానం లేకపోవడం, స్వతహాగా ఆస్తిపరుడు కావడంతో, వసూళ్లు, అక్రమాలపై అంతగా ఆసక్తి లేకపోవడంతో ఆ పీఏకు అది కలిసి వచ్చింది. ఇంకేముంది.. సార్ చెప్పారంటూ అన్నింటికీ అందరిపై తలో చేయి వేసి, జేబులు నింపేసుకుంటున్నాడని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దసరా చందాలతో పాటు అనేక పండగలు, పర్యటనల పేరిట భారీగానే దండుకుంటున్నాడని అనేకమంది గగ్గోలు పెడుతున్నారు. స్థాయి సంఘంతోపాటు కౌన్సిల్లో అజెండాలు ఆమోదం పొందాలంటే ఆ పీఏను కలవాల్సిందే. చేయి తడపాల్సిందే. ఎవరికైనా బదిలీ కావాలన్నా నచ్చిన సీటు వేయించాలన్న ఆ పీఏ హుకుం జారీ చేస్తున్నారు. ప్రైవేట్ పీఏ ఉద్యోగం కావడంతో ఉన్న ఈ ఐదు నెలలే దండిగా దండుకోవాలన్న అత్యాశతో బరితెగించి మరి అందర్నీ బెదిరిస్తున్నాడని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లింపుల్లో మూడు నుంచి ఐదు శాతం వసూలు చేస్తున్నాడు ఆ పీఏ ... నగరంలోని అన్ని జోన్లలో టౌన్ ప్లానింగ్ అధికారులపై నిత్యం ఒత్తిడి తెచ్చి లక్షలాది రూపాయలు వసూలు చేస్తూ ఫైల్‌లను అప్రూవల్ చేయిస్తూ, అనధికార నిర్మాణాలకు కేంద్ర బిందువుగా ఉండి లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నాడన్న ఆరోపణలు పెద్ద ఎత్తున వ్యక్తమవుతున్నాయి. అధికారులను, ఉద్యోగులను హేళన చేస్తూ, చులకన భావంతో పిలుస్తూ తెగ రెచ్చిపోతున్నాడు ఆ పిఏ... ఇటీవల స్టాండింగ్ కమిటీలో 205 అంశాలు ప్రతిపాదించారు. ఆ సమయంలో ఆ పిఏ లక్షల్లో భారీగా వసూళ్లకు పాల్పడినట్లు తెలిసింది. వాటాల పంపకంలో తేడాలు రావడంతో ఆ పిఏ వాటాలు తీసుకోవడంపై పలువురు సభ్యులు వ్యతిరేకించినట్లు సమాచారం. ముడసర్లోవ పార్కింగ్ కోసం ఓ గుత్తేదారుడు లక్షన్నర కమిషన్‌గా ఇచ్చినట్లు సమాచారం. జీవీఎంసీలో ఉన్న ఆ కీలక నేతకు తెలిసే ఈ పిఏ ఇదంతా చేస్తున్నాడా లేదా ? లేదా ఆయన్ని బురిడీ కొట్టించి జీవీఎంసీలో చక్రం తిప్పుతున్నాడా అన్న ప్రశ్న ఇప్పుడు జీవీఎంసీ విభాగాల్లో చక్కర్లు కొడుతుంది. ఇలా ప్రతి స్టాండింగ్ కమిటీ సమావేశం లోకి వచ్చే అంశాలపై కమిషన్లు వసూలు చేయడంలో ఆయనే సూత్రధారని ప్రచారం సాగుతుంది. న్యాయవాది చదువుకున్నాను అంటూ అనేక మందిని బెదిరిస్తున్నట్లు కూడా ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. గతంలో మాజీ ఎంపీ సబ్బం హరి దగ్గర కూడా పీఏగా చేశాడన్న ప్రచారం కూడా పెద్ద ఎత్తున వినిపిస్తుంది. ఆ విభాగంలో సిబ్బంది కూడా ఆయన ముందు సలాం చేయాల్సిందే. ప్రభుత్వ పిఏలు సైతం అనిగి, మణిగి ఉండాల్సిందే. ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ ఉద్యోగులను పిఏలు పెట్టుకుంటే వారికి అధికారుల హోదాతో పాటు, నియమ, నిబంధనలు, తమ పరిధి ఎంతవరకు తెలిసి పనిచేస్తారని లేదంటే ఉద్యోగం పోతుంది అన్న భయం వారిలో ఉంటుందని, ప్రైవేటు పిఏలను పెట్టుకుంటే వారు ఇలాగే బరితెగించి అక్రమ వసూళ్లకు పాల్పడతారని అనేకమంది అధికారులు అంటున్నారు.

ప్రైవేట్ పీఏలు ప్రమాదమే....!

ప్రజాప్రతినిధులారా తస్మాత్ జాగ్రత్త ! ప్రైవేటు పిఏలను నమ్ముకుంటే ఎప్పుడైనా నట్టేట మునగాల్సిందే. ఇది అనేక మంది నేతలకు ఎదురైన పరాభవమే. అధికారంలో ఉండగా ఆ పిఏల పెత్తనం ఆయా పార్టీలకే చెడ్డపేరు వచ్చేలా చేస్తున్నారనేది నగ్నసత్యం. ప్రజా ప్రతినిధుల వద్దకు వచ్చిన ప్రజలకు, అధికారులకు సంధాన కర్తల ఉండాల్సిన పిఏలు నేతల వ్యక్తిగత అంశాల్లోకి చొరబడి పాలనపై పట్టు బిగిస్తున్నారన్న వాదనలు అనేకం వినిపిస్తున్నాయి. అధికారికంగా జవాబుదారితనం లేకపోవడంతో, ఉన్నన్నాళ్ళు చక్రం తిప్పి కోట్లాది రూపాయల ఆస్తులు సంపాదించుకుంటున్నారన్న అనేకమంది పీఏలపైనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రైవేట్ పిఏల వైఖరిపై అనేకమంది ప్రజాప్రతినిధులు తమకు మచ్చలు తెచ్చే వారిని పక్కన పెట్టేశారు. గతంలో హోం మంత్రి అనిత పీఏపై ఇలాంటి ఆరోపణలు వస్తే వెంటనే తొలగించారు. అలాగే పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గణబాబు పిఏల పై ఆరోపణలు రావడంతో వారిని తీసేశారు. కీలకమైన ప్రజా ప్రతినిధుల వద్ద పి ఏ పెత్తనం బాగా పెరిగిపోయిందన్న విమర్శలు అధికంగా వినిపిస్తున్నాయి. జీవీఎంసీలో కూడా ఆ కీలక ప్రజా ప్రతినిధి పట్టించుకోకపోవడంతో ఆయన రాజకీయ ఉనికికే ప్రమాదంగా మారుతుందన్న విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. పిఏ లకు తమ లోగుట్టు అంతా తెలియడంతోనే వారిని నియంత్రించలేక పోతున్నారని ప్రచారం కూడా సాగుతుంది. అనేకమంది ప్రజాప్రతినిధులు పీఏల చేతిలో కీలుబొమ్మలుగా మారిపోయారనే ప్రచారం లేకపోలేదు.

రూ.39,216 కోట్ల విలువైన ఒప్పందాలపై విశాఖ పోర్టు సంతకాలు

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: ముంబై వేదికగా అక్టోబర్ 27 నుండి 31 వరకు జరుగుతున్న ఇండియా మారిటైమ్ వీక్-2025 భారత దేశ సముద్ర రంగ సామర్థ్యాన్ని , అంతర్జాతీయ భాగస్వామ్యాలను ప్రతిబింబించే ప్రధాన వేదికగా నిలుస్తోంది. ఈ వేడుకలో 100కి పైగా దేశాల ప్రతినిధులు పాలుపంచు కుంటున్నారు. పోర్టులలో మౌలిక సదుపాయాలు, షిప్ బిల్డింగ్, అంతర్గత జలమార్గాలు మరియు గ్రీన్ షిప్పింగ్ వంటి రంగాల్లో భారత్‌ను అంతర్జాతీయ నౌకాయాన కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా చర్చలు సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంలో విశాఖపట్నం పోర్టు అథారిటీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కలిసి దుగరాజపట్నంలో మెజర్ పోర్టు కమ్ షిప్ బిల్డింగ్ అండ్ షిప్ రిపేర్ క్లస్టర్ ఏర్పాటు కోసం రూ.29,662 కోట్ల విలువైన ఒప్పందపత్రాలను మార్చుకున్నారు. మెకాన్ ఇండియాతో పోర్ట్ రూ.3,000 కోట్ల విలువైన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఎన్‌బీసీసీతో రూ. 500 కోట్ల విలువైన ఒప్పందం ద్వారా హార్బర్ పార్క్‌లో ఆధునికీకరణ పనులకు శ్రీకారం చుట్టింది హడ్కోతో రూ. 487.38 కోట్ల విలువైన మరో ఒప్పందం ద్వారా కార్గో బర్త్‌ల యాంత్రీకరణ, ఆధునీకరణ పర్యావరణ హిత సాంకేతికతల అమలుకు అడుగులు వేస్తోంది. పోర్టు ప్రాంగణంలో అంతర్గత ఫ్లైఓవర్లు నిర్మించడానికి రైల్ వికాస్ని లిమిటెడ్‌తో రూ.535 కోట్లతో ఒప్పందం కుదుర్చుకున్నారు. 39,216 కోట్లకు పైగా ఒప్పందాలను కుదుర్చుకొని విలువైన పెట్టుబడులను ఆకర్షించాయి. ఇండియా మేరిటైమ్ వీక్-2025 దేశ సముద్ర వారసత్వాన్ని బలోపేతం చేస్తూ, అంతర్జాతీయ స్థాయిలో భారత ప్రతిష్టను మరింత పెంచింది.

ఘనంగా గంటా రవితేజ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - భీమిలి: భీమునిపట్నం నియోజకవర్గ శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు తనయుడు గంటా రవితేజ జన్మదినం సందర్భంగా స్టేట్ హ్యూమన్ రైట్స్ చైర్మన్ గిరి శ్రీనివాస్‌రావు నిడిగట్టు గ్రామంలో సద్గురు సేవా ఆశ్రమంలో ఉన్న వృద్ధుల సమక్షంలో కేక్ కట్ చేశారు. ఆశ్రమంలో ఉన్న వృద్ధులందరికీ దుప్పట్లు, పండ్లు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో గంటా రవితేజ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

ఆనందపురం: ఆనందపురం కేజీబీవీలో గంటా రవితేజ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీ మహాలక్ష్మి కల్చరల్ అధినేత ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్ ఆర్థిక సహాయంతో 260 మంది విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చచేశారు. సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ ఈ సంవత్సరం గంట రవితేజ

పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులందరికీ ఉపయోగపడేలా వాషింగ్ మిషన్ అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ షీలా, ఆనందపురం పిఎసిఎస్ చైర్మన్ అప్పలరాజు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కోరుకొండ శివాజీ, వైస్ చైర్మన్ మంగ అప్పన్న, కోఆప్షన్ మెంబర్స్ అక్కిరెడ్డి దేవుడు బాబు, బంగార్రాజు, యువ నాయకులు కోరాడ వైకుంఠం, వృక్ష ఫౌండేషన్ వ్యవస్థాపకులు కాకర సురేష్ కుమార్, యువ నాయకులు మరుపల్లి సాయి జ్ఞానేశ్వర్, దళాయి శివ, మరుపిల్ల బాంధవ్, పాలవలస శేఖర్, సుంకర శివ పాల్గొన్నారు.

గెడ్డవాగులో పడి బాలిక గల్లంతు

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం మద్ది పంచాయతీ పరిధిలో తునిపాలం గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. తుని పాలం గ్రామానికి చెందిన కాళ్ల శ్రీను, గౌరీ దంపతుల రెండవ కుమార్తె ధనుశ్రీ (13) గురువారం మధ్యాహ్నం 12 గంటలకు సమయంలో తల్లితో కలిసి బట్టలు ఉతకడానికి తునిపాలం గెడ్డ వద్దకు వెళ్లి గెడ్డలో కాలు జారిపడి ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డలో బాలిక గల్లంతయింది. ధనుశ్రీ తల్లి బోరున విలపిస్తూ గ్రామస్తులందరినీ కేక వేయగా వారు వచ్చి వెతికిన ఫలితం లేకపోవడంతో అప్పటికే విషయం తెలిసిన పోలీసు వారు అగ్నిమాపక శాఖ వారు గాలింపు చర్యలు మొదలుపెట్టారు.

అనంతరం రెవెన్యూ, మండల పరిషత్, విద్యాశాఖ, స్థానిక సచివాలయ సిబ్బంది తదితరులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. సహాయక బృందాలు వారు స్థానిక యువత గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ బాలిక ఆచూకీ దొరకలేదు. సాయంత్రం సంఘటన స్థలానికి భీమిలి నియోజకవర్గం ఇన్చార్జ్ సిహెచ్ విజయబాబు స్థానిక కూటమినేతలు పరామర్శించడం జరిగింది. అనంతరం భీమిలి నియోజకవర్గం వైసీపీ ఇన్చార్జి చిన్న శ్రీను మండల వైసీపీ నాయకులు సంఘటన స్థలాన్ని పరిశీలించడం జరిగింది. గాలింపు చర్యలు కొనసాగుతాయని అధికారులు తెలియజేశారు. అభం శుభం తెలియని అమాయక చిన్న పిల్ల కళ్ళముందే గెడ్డలో పడి గల్లంతయిపోవడం తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు స్థానిక గ్రామస్తులు బోరున విలపిస్తున్నారు.

బోటు మునిగిన మత్స్యకారుడికి రూ.30 లక్షలు చెల్లించాలి

విశాలాంధ్ర - వన్‌టౌన్: విశాఖ ఫిషింగ్ హార్బర్ సెంట్రల్ డాక్ ప్రాంతంలో మత్స్యకారుడు మేరుగ ధనరాజు బోటు తుఫాను అలలు దాటికి మునిగిపోవడం జరిగిందని, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఆ మత్స్యకారుడికి రూ.30 లక్షల నష్టపరహారం చెల్లించాలని వైసీపీ నాయకులు, మాజీ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మత్స్యకారుడుని పరామర్శించిన వాసుపల్లి గణేష్ కుమార్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి పాలనలో ఎవరికి ఎటువంటి కష్టం వచ్చిన అప్పటి ప్రభుత్వం ముందుండి తక్షణ సహాయక చర్యలు చేపట్టి వారిని ఆదుకోవడం జరిగేదని అన్నారు. ఫిషింగ్ హార్బర్‌లో మునిగిపోయిన బోటుకు నష్టపరిహారం చెల్లిస్తామని ప్రభుత్వం చెప్పడం జరిగిందన్నారు. వట్టి మాటలతో ప్రజలను మోసగించకుండా వారికి ప్రభుత్వం అండగా ఉండాలని తెలిపారు. మునిగిపోయిన బోటుకి తక్షణమే ప్రభుత్వం రూ.30 లక్షలను చెల్లించాలని వాసుపల్లి గణేష్ కుమార్ డిమాండ్ చేశారు.

మితిమీరిన మొబైల్ వీక్షణం గుండెకు పోటు

విశాలాంధ్ర - మధురవాడ: మొబైల్ వీక్షణం మితిమీరడం, నిద్రలేమి, మత్తుపదార్థాల వినియోగం, తీవ్ర వత్తిడులకు గురికావడం వంటివి యువతలో గుండెపోటుకు దారితీసే అవకాశం ఉందని గీతం ఆసుపత్రి (జిమ్‌సర్) న్యూరాలజిస్ట్ డాక్టర్ విజయభాస్కరరావు తెలిపారు. ప్రపంచ స్ట్రోక్ దినం సందర్భంగా గురువారం గీతం ఆసుపత్రిలో నిర్వహించిన ప్రత్యేక వైద్యశిబిరంలో ఆయన మాట్లాడుతూ 45 సంవత్సరాల లోపు వయస్సు గలవారిలో గుండెపోటు వంటివి రావడానికి ప్రధాన కారణం ఆరోగ్యపు అలవాట్లేనన్నారు. గీతం ఆసుపత్రిలో ఏటా 500 మంది రోగులను తాము పరీక్షిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఆసుపత్రిలో అధునాతన వైద్య పరికరాలతో చికిత్స అందించి సురక్షితంగా రోగులను తిరిగి ఇళ్ళకు పంపుతున్నామన్నారు. ప్రపంచ స్ట్రోక్ దినం సందర్భంగా జిమ్‌సర్ ఆసుపత్రిలో వైద్య విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిమ్‌సర్ వైద్య కళాశాల డీన్ డాక్టర్ ఎస్.పి.రావు, డాక్టర్ వి.దీప్తి, వైద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో తక్షణమే పారిశుధ్య పనులు చేయాలి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: తుపాను కారణంగా పునరావాస శిబిరాల నుండి ప్రజలు తిరిగి వెళ్ళేలోగా వారి ఇళ్ళను, వీధులను ప్రభుత్వం శుద్ధి (శానిటైజేషన్) చేసి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని విదసం ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకట రావు డిమాండు చేసారు. ఈ మేరకు వెంకటరావు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్‌కు వినతి పత్రం పంపించారు. రాష్ట్రాన్ని కుదిపేసిన మొంథా తుపాను నష్టాన్ని కనిష్ట స్థాయిలో నివారించడానికి అధికారులు సిబ్బంది తీవ్రంగా శ్రమించడంతో అతి తక్కువ ప్రాణ నష్టంతో బయట పడ్డామని, తుపాను అనంతర నష్టాన్ని నివారించడానికి మళ్ళీ యంత్రాంగం సన్నద్ధం కావల్సిన అవసరాన్ని వెంకట రావు ప్రభుత్వానికి గుర్తు చేశారు. వరద, వర్షపు నీటితో అనేక గ్రామాల్లో ఇల్లు ఊళ్లు ముంపునకు గురయ్యి ఇళ్లల్లో కలుషిత బురద పేరుకుపోయి వ్యాధికారక బాక్టీరియా వ్యాపించే అవకాశం ఉందన్నారు. ఈ బాక్టీరియా ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీసి అంటు వ్యాధులు, సీజనల్ వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని ప్రభుత్వం తక్షణమే మురికి శుద్ధి చేసిన తర్వాత మాత్రమే ప్రజలను ఇళ్లకు పంపాలని వెంకట రావు ప్రభుత్వానికి నివేదించారు.

అదానీ కంపెనీల్లో ఎల్ఐసి పెట్టుబడులు దుర్మార్గం

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి చంద్రశేఖర్

విశాలాంధ్ర - విశాఖ: అదానీ కంపెనీల్లో ఎల్ఐసి పెట్టుబడులు పెట్టడం దుర్మార్గమని సిపిఐ విశాఖ జిల్లా సమితి సహాయ కార్యదర్శి పాత్రపల్లి చంద్రశేఖర్ విమర్శించారు. సిపిఐ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద గురువారం జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల నిధులను దొడ్డిదారిన అదానీ కంపెనీల్లోకి మళ్లించారని అన్నారు. సుమారు 35 వేల కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టారని అన్నారు. వాషింగ్టన్ పోస్ట్ ఈ విషయాన్ని బయట పెట్టిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఒత్తిడితో ఇది జరిగిందని విమర్శించారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన అదానీని కాపాడేందుకు ఈ పెట్టుబడులు పెట్టారన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ తన మిత్రుడు అదానీకి దేశంలోని సంపదను కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఓడరేవులు, విమానయాన రంగం, విద్యుత్తు, రైల్వేలు అదానీకి కట్టబెట్టే ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు. అదానీ కంపెనీల్లోకి ఎల్ఐసి పెట్టుబడులు పెట్టడంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీతో విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె సత్యాంజనేయ, ఎం మన్మధరావు, ఆర్ శ్రీనివాసరావు, సిఎస్ క్షేత్రపాల్ రెడ్డి, పడాల గోవింద్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యు.నాగరాజు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు వై. రాంబాబు, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు వనజాక్షి, మహిళా సమాఖ్య నాయకులు పుష్పలత, పద్మ, రమణమ్మ, పార్టీ సభ్యులు మీసాల శ్రీనివాసరావు, అడారి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

డోర్ టు డోర్ వ్యర్థాలు సేకరణ జరగాలి

- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

విశాలాంధ్ర - గాజువాక: క్లాప్ వాహనాలు ప్రతి ఇంటి నుండి తప్పనిసరిగా వ్యర్థాల సేకరణ నిత్యం జరపాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. గురువారం ఆయన 6వ జోన్‌లో 73, 74, 75, 76 వార్డుల పరిధిలోని సన్నత్ నగర్, సమతా నగర్, పెదగంట్యాడ, గంగవరం, బీసీ రోడ్, హెచ్.బి.కాలనీ తదితర ప్రాంతాలలోని సుడిగాలి పర్యటన చేసి క్లాప్ వాహనాల పనితీరును, ప్రధాన గెడ్డలను పరిశీలించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ 6వ జోన్ లో పనిచేస్తున్న క్లాప్ వాహనాల పనితీరును పరిశీలించి, క్లాప్ వాహనాలు వీధులలో, కాలనీలలో, అంతర్గత రోడ్లలో వ్యర్థాల సేకరణ జరపకుండా ప్రధాన రహదారులపై ఎక్కువగా ఉంటున్నాయని, వాహనాల్లో అమర్చిన మైక్ అనౌన్స్మెంట్ కూడా సరిగా చేయడం లేదని, ఇంటింటి నుండి వ్యర్థాల సేకరణలో క్లాప్ వాహనాల పనితీరు మెరుగు పరుచుకోవాలని, అలా కానిచో కఠిన చర్యలు చేపట్టడం జరుగుతుందని సంబంధిత శానిటరీ ఇన్స్పెక్టర్లను, వార్డు సచివాలయం శానిటరీ కార్యదర్శులను కమిషనర్ ఆదేశించారు. అనంతరం 73, 76 వార్డులలో ఉన్న ప్రధాన గెడ్డలను పరిశీలించి, వర్షాలకు అధికంగా గెడ్డలో వ్యర్థాలు పేరుకుపోయి అడ్డంకులు ఏర్పడతాయని, వాటిని గుర్తించి వెంటనే తొలగించాలన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ బిఆర్ఎస్ శేషాద్రి, ఎ.ఎమ్.ఓ.హెచ్ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మొంథా తుఫాన్ బాధితులకు తక్షణ ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - కొమ్మాది: మధురవాడ జీవీఎంసీ జోన్-2పరిధి మధురవాడ పరిసర ప్రాంతాల్లో ఇటీవల మొంథా తుఫాన్ కారణంగా నిరాశ్రయులైన బాధితులకు తక్షణ సహాయం పంపిణీ జరిగింది. స్థానిక ఐదవ వార్డ్ పరిధిలోని మారికవలస కళ్యాణ మండపం పునరావస కేంద్రం వద్ద ఆశ్రమం పొందుతున్న శారదానగర్‌కు చెందిన నాలుగు కుటుంబాలకు ఈమేరకు ప్రభుత్వం ప్రకటించిన సొమ్మును స్థానిక కార్పొరేటర్ మొల్లి హేమలత, స్థానిక భీమిలి నియోజకవర్గం శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఆయన ప్రతినిధి చిక్కాల విజయబాబు సమక్షంలో సంబంధిత చెక్కుల పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో విశాఖ రూరల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ కిషోర్,వీఆర్వోలు పూర్ణ సాయి, సురేష్ బాబు, టిడిపి విశాఖ పార్లమెంటరీ పార్టీ ఉపాధ్యక్షులు వాండ్రాసి అప్పలరాజు, బోయి శ్రీను, నమ్మి రమణ, వార్డు అధ్యక్షులు నాగోతి సత్యనారాయణ అధ్యక్షులు రాష్ట్ర నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ నాగోతి అనిత, మాజీ కార్పొరేటర్ మన్యాల సోంబాబు,ఈగల రవి, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

నవంబర్ 1న రాజ్యాంగ పరిరక్షణ సదస్సు
డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జె.వి.ప్రభాకర్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: భారత రాజ్యాంగం ప్రమాదంలో పడిందని దాన్ని రక్షించుకోవాల్సిన కర్తవ్యం అన్ని వర్గాలపై ఉందని దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) రాష్ట్ర అధ్యక్షుడు జె.వి.ప్రభాకర్ తెలిపారు. నగరంలోని రామా టాకీస్ రోడ్‌లో గల అంబేద్కర్ భవన్‌లో గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగం - దళిత హక్కులు - బిజెపి విధా నాలపై రాజ్యాంగ పరిరక్షణ సదస్సును నవంబర్ 1న నగరంలోని ద్వారక నగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆల్ ఇండియా దళిత రైట్స్ మూమెంట్ (ఏఐడిఆర్ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి వి.ఎస్.నిర్మల్ ముఖ్యఅతిథిగా, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణ మూర్తి, సిపిఎం జాతీయ కార్యవర్గ సభ్యుడు లోకనాథం, డిహెచ్ పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బారావు అతిథులుగా హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరించారు. బిజెపి, ఆర్ఎస్ఎస్‌కు కేంద్రంలో పూర్తి మెజారిటీ వచ్చి ఉంటే ఇప్పటికే లౌకికవాదం, ప్రజాస్వామ్యం లాంటి పదాలు రాజ్యాంగం నుంచి తొలగించేవారని చెప్పారు. రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా ఉన్న రాజ్యాంగ పీఠిక నుండి వాటిని తొలగించాల్సిన అవసరం లేదని పలుమార్లు సుప్రీంకోర్టు తీర్పు చెప్పిందని పేర్కొన్నారు. అయినా బీజేపీ ఆర్ఎస్ఎస్ మనువాద ప్రభుత్వం ఆగటం లేదని దుయ్యబట్టారు. దేశంలో ఉన్న సంపదనంతా కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే కుట్ర సాగుతుందని ప్రభుత్వ రంగ పరిశ్రమలు, సంస్థలు ప్రైవేటీకరిస్తున్నారని వండిపడ్డారు. దీనివల్ల రిజర్వేషన్లు కనుమరుగయ్యే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజులు, కార్యదర్శి జి.రాంబాబు, ప్రతి నిధులు బి.శ్రీనివాస్, పి.వీర్రాజు, ఆర్.సరస్వతి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చందన మోహనరావు సంస్మరణ సభ

- పలువురు ప్రముఖుల నివాళులు

విశాలాంధ్ర - విశాఖపట్నం: వస్త్ర రంగంలో పేరుగాంచిన చందన మోహనరావు సంస్మరణ సభ గురువారం నగరంలోని ఓ హోటల్‌లో ఘనంగా నిర్వహించారు. సంస్కరణ సభకు శాసనసభ స్పీకర్ సీహెచ్ అయ్యన్నపాత్రుడు ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు హాజరయ్యారు. ఆయన చిత్రపటానికి పూలమాలలతో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చందన మోహనరావు సేవలను వారు కొనియాడారు.

చందన బ్రదర్స్ వ్యవస్థాపకులు, సేవా తత్పరుడు, దుస్తులు, బంగారం వ్యాపారంలో రెండు ఉభయ రాష్ట్రాల్లో పేరొందిన వ్యక్తి దివంగత చందన మోహనరావు అని గుర్తు చేశారు. ఐదు దశాబ్దాల పాటు ఎన్నో నాలుగు రాష్ట్రాల్లో 45కుపైగా బ్రాంచ్‌లు ఏర్పాటు చేసి ఎంతో మందికి ఉపాధి కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఆయన ఆశయాల్ని మోహనరావు అల్లుడు, సీఎంఆర్ వ్యవ స్థాపకులు మావూరి వెంకట రమణ కొనసాగించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మావూరి వెంకట రమణ, ఆయన కుటుంబ సభ్యులు, రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వంశీకృష్ణ, వెలగపూడి రామకృష్ణబాబు, విష్ణుకుమార్ రాజు, పంచకర్ల రమేష్, ప్రభుత్వ విప్ గణబాబు, వుడా చైర్‌పర్సన్ ఎంవీ ప్రణవ్ గోపాల్, మాజీ మేయర్ గొలగాని హరివెంకట కుమారి, శ్రీనివాస్ దంపతులు, మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయ్ కుమార్, తిప్పల గురుమూర్తి రెడ్డి, వాసుపల్లి గణేష్ కుమార్, పద్మశ్రీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, కంకటాల మల్లిక్, వీవీ రమణమూర్తి, మావూరి బాలాజీ, తాళ్లూరి పూర్ణచంద్రరావు, తుమ్మిడి బాబీ, పేర్ల సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

తుఫాను బాధితులకు ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం తర్లువాడ గ్రామపంచాయతీలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ముంపునకు గురైన ప్రజలకు కూటమి నాయకులు పునరావాసం కల్పించి నిత్యవసర సరుకులు అందజేశారు. అందులో భాగంగా 13 మంది కుటుంబ సభ్యులకు జిల్లా కలెక్టర్, శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు చొరవతో బాధిత కుటుంబాలకు గురువారం పందలపాక, తర్లువాడ పంచాయతీలకు 11000 రూపాయలు బాధిత కుటుంబానికి నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శ్రీనుబాబు, చిక్కాల విజయబాబు, సర్పంచ్ బిఆర్‌బి నాయుడు, పార్టీ ప్రెసిడెంట్ తాత్రాజు అప్పారావు, అప్పలరాజు, అధికారులు కూటమి నాయకులు పాల్గొన్నారు.

నవంబర్ 5న జల హారతి

విశాలాంధ్ర-సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామివారి కొండ దిగువ వరాహ పుష్కరిణిలో నవంబర్ 5వ తేదీన జలహారతి కార్యక్రమం జరుగనున్నట్లు ఇన్‌చార్జ్ కార్యనిర్వహణాధికారి సుజాత తెలిపారు. ఈ కార్యక్రమము నవంబర్ తేది.05న సాయంత్రము జరుగను. ఆరోజు సాయంత్రం సమారు గం..04.30ని.లకు కొండదిగువ స్వామి వారి అనుబంధ దేవాలయమైన శ్రీవేంకటేశ్వర స్వామివారి ఉత్సవ మూర్తులను పల్లకీలో పుష్కరిణి వద్దకు వేంచేయింప చేసి వేద, నాద వాయిద్య లతో ఛత్ర, చామరాలతో, దేవ కళికలతో, పుణ్యస్త్రీలతో బయలు దేరి సుమారు గం..05.00ల సమయములో శ్రీ వరాహ పుష్కరిణి వద్దకు ఉత్సవ మూర్తులను వేంచేయింప చేస్తారు. పిదప షోడషోపచారములు కావించి, నక్షత్రహారతి, కుంభహారతి, ఆయుంది ప్రార్థనలు శ్రీస్వామి వారికి, పుష్కరిణికి సమర్పిస్తారు. ఫలములు, పానకములు నివేదన చేసి మహామంగళ హారతి, మంగళాశాసనముతో, ప్రసాద వినియోగముతో, కార్యక్రమము ముగుస్తుంది అని ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు తెలిపారు.

భీమిలి జోన్ 1, 2, 3 వార్డులలో రోజు విడిచి రోజు తాగునీరు

-భీమిలి జోనల్ కమిషనర్ ఇప్పినాయుడు

విశాలాంధ్ర - భీమిలి: మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ జోన్-1 భీమునిపట్నం పరిధిలో 1,2,3 వార్డులలోని పలు ప్రాంతాలకు రోజు విడిచి రోజు తాగునీరు అందించడం జరుగుతుందని భీమిలి జోన్ జోనల్ కమిషనర్ ఇప్పినాయుడు గురువారం పత్రికా ప్రకటన ద్వారా 1వ జోన్ (భీమిలి జోన్) ప్రజలకు తెలియజేశారు. మొంథా తుఫాన్ కారణంగా గోస్తని నది ప్రవాహం పెరగడంతో, ఇన్ ఫిల్ట్రేషన్ వెల్స్ పూర్తిగా మునిగిపోవడం వలన ప్రతిరోజు పంప్ చేసే నీరు బురదగా మారిందని, అందువలన ఆ నీటిని శుద్ధి చేసి సరఫరా చేయడానికి కొంత సమయం పడుతున్నందున ప్రజలకు అందించే తాగునీరు రోజు విడిచి రోజు కుళాయి ద్వారా వార్డు నంటర్లు 1, 2, 3 ప్రాంతాల్లో అనగా తగరపువలస, సంగివలస, చిట్టివలస, చిల్లపేట, బ్యాంక్ కాలనీ, మామిడిపాలెం, భీమిలి, కృష్ణ కాలనీ, బర్మా కాలనీ, ఎగువపేట, వలందపేట, సత్యనారాయణపేట, రెల్లివీధి, తోటవీధి మొదలైన ప్రాంతాల్లో నీటి సరఫరా చేయబడునని జోనల్ కమిషనర్ తెలిపారు. మిగిలిన సమయాల్లో నీటి వాటర్ ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయబడతుందని, ప్రతి రోజు నీటి సరఫరా సమయాలలో మార్పులు చోటుచేసుకునే అవకాశమున్నందున నగర ప్రజలు గమనించి జీవీఎంసీ తాగునీటి విభాగానికి సహకరించవలసిందిగా జోనల్ కమిషనర్ నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

గడువులోగా మాస్టర్ ప్లాన్ రహదారులు పూర్తి చేయాలి

వీఎంఆర్డీఏ ఛైర్మన్ ఎం.వి.ప్రణవ్ గోపాల్

విశాలాంధ్ర - విశాఖ: భోగాపురం ఎయిర్ పోర్టుకు అనుసంధానించే ప్రధాన రహదారుల నిర్మాణ పనులను గడువులోగా పూర్తి చేయాలని వీఎంఆర్డీఏ ఛైర్మన్ ఎం.వి.ప్రణవ్ గోపాల్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మాస్టర్ ప్లాన్ 7 ప్రధాన రహదారుల పురోగతిని ప్రతీ 15 రోజులకూ సమీక్షిస్తామని అన్నారు. కైలాసగిరిపై నిర్మాణంలో ఉన్న త్రిశూల్ ప్రాజెక్ట్ పనులు జనవరి నెలాఖరుకి పూర్తి చేయాలని ఆదేశించారు. వుడా పార్క్ ఆవరణలో స్కేట్ బోర్డ్ పనులు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ప్రణాళిక విభాగం అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఎల్.ఆర్.ఎస్. కు సంబంధించి ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలని సూచించారు. అదేవిధంగా ఇటీవల ప్రభుత్వం ఎల్.ఆర్. ఎస్. కు దరఖాస్తుల గడువు వచ్చే ఏడాది జనవరి 23 వరకు పెంచిందని, దీనిపై విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. ఈ సమీక్షా సమావేశంలో జాయింట్ కమిషనర్ కె.రమేశ్, చీఫ్ అర్బన్ ప్లానర్ శిల్పా, ప్రధాన ఇంజినీర్ వినయ్ కుమార్, పర్యవేక్షక ఇంజనీర్లు భవానీ శంకర్, మధుసూదన రావు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకనక మహాలక్ష్మి అమ్మవారి మహోత్సానికి కలెక్టర్‌కు ఆహ్వానం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: మార్గశిర మాసోత్సవాల నేపథ్యంలో నవంబర్ 01వ తేదీన జరగనున్న బురుజుపేట శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి పందిరి రాట మహోత్సవ క్రతువుకు విచ్చేయవల్సిందిగా కోరుతూ ఆలయ అధికారులు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ను సాదరంగా ఆహ్వానించారు. ఆలయ ఈవో కె. శోభారాణి, ఇతర అధికారులు, అర్చకులు కలెక్టర్ను గురువారం సాయంత్రం తన ఛాంబర్లో కలిసి సంప్రదాయ రీతిలో ఆహ్వానం తెలిపారు. దుశ్శాలువాతో సత్కరించి ఆహ్వాన పత్రికను, అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు. అర్చకులు, వేద పండితులు అక్షితలు చల్లి ఆశీర్వచనాలు అందజేశారు. కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయ సన్నిధిలో నవంబర్ 01వ తేదీన మార్గశిర మాసోత్సవాలకు అంకురార్పణ జరగ్గా నవంబర్ 21 నుంచి డిసెంబర్ 19వ తేదీ వరకు ఉత్సవాలు జరగనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

సచివాలయం వద్ద గల నీటిలో పడి వ్యక్తి మృతి

విశాలాంధ్ర - పద్మనాభం: మండలములోని చిన్నాపురం గ్రామానికి చెందిన బొట్ట రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసు వారు తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. చిన్నాపురం గ్రామానికి చెందిన బట్ట రమణమ్మ అంగన్వాడీ ఆయాగా విధులు నిర్వహిస్తూ ఉంది. ఆమె భర్త బొట్ట రమణ (57) విపరీతంగా మద్యం సేవించే అలవాటు ఉన్నట్లు అని తెలియజేశారు. ఒక్కోసారి రెండు మూడు రోజులు ఇంటికి రాకుండా ఉండిపోయినట్లు తెలియజేశారు. అలాగే ఈనెల 28వ తారీఖున ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రానట్లు గురువారం 30వ తారీఖున చిన్నాపురం సచివాలయం వద్ద వర్షపు నీటి లో చనిపోయి ఉన్నట్లు ఆమెకు తెలియగా తన భర్త మద్యం ఎక్కువై తాగి ప్రమాదవశాత్తు పడిపోయి చనిపోయి ఉండవచ్చని పోలీసు వారికి ఇచ్చిన ఫిర్యాదులు తెలియజేయడం జరిగినది. పోలీసు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సీఎం సహాయనిధికి రూ.5 లక్షలు అందించిన గంటా రవితేజ

విశాలాంధ్ర తగరపువలస: సీఎం సహాయ నిధికి భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కుమారుడు, టీడీపీ యువ నాయకుడు గంటా రవితేజ రూ. 5 లక్షలు అందజేశారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ను ఉండవల్లి నివాసంలో గురువారం కలిసి ఈ మేరకు చెక్కును అందించారు. మొంథా తుపాను రాష్ట్రంపై తీవ్ర ప్రభావం చూపిన నేపథ్యంలో గురువారం తన పుట్టినరోజు వేడుకలను రవితేజ రద్దు చేసుకున్నారు. బాధితులను ఆదుకోవడానికి తన వంతు బాధ్యతగా నియోజకవర్గంలో పార్టీ యువతతో వచ్చి ఈ మొత్తాన్ని విరాళంగా ఇచ్చారు. అనంతరం "గీత మకరందం" ఆధ్యాత్మిక గ్రంథాన్ని లోకేష్ కు బహూకరించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ కార్యకలాపాల గురించి లోకేష్ ఆరా తీశారు. భీమిలి టీడీపీకి కంచుకోటని, కె.ఎస్.ఎస్.లు.. కమిటీలు.. విజయవంతంగా పూర్తి చేశామని రవితేజ తెలిపారు. లక్ష పైగా పార్టీ సభ్యత్వాలు నమోదు చేసిన విషయాన్ని లోకేష్ కు వివరించారు. యువత భాగస్వామ్యంతో పార్టీని మరింత పటిష్టం చేసే దిశగా ముందుకు వెళు _న్నామని చెప్పారు. రవితేజకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేసిన లోకేష్.. నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తూ ప్రజలతో మమేకం కావాలని సూచించారు.

ఆక్రమణలను యుద్ధ ప్రాతిపదికన తొలగించండి

- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: నగరంలో పలు రోడ్లు, కాలువలు, ఫుట్‌ఫాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న ఆక్రమణలను తొలగించాలని జీవీఎంసీ అధికారులను జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. గురువారం ఆయన 2వ జోన్, 12వ వార్డు పరిధిలో గల ఆరిలోవ, పెదగదిలి సమీపంలో ఉన్న ఆక్రమణలను పరిశీలించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ నగరంలో పలుచోట్ల రోడ్లు, ఫుట్‌ఫాత్‌లు, కాలువలపై ఉన్న ఆక్రమణలను తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. ఆరిలోవ పెదగదిలి సమీపంలో ఫుట్‌పాత్‌ను ఆక్రమించి హోటల్‌ను నిర్వహిస్తున్న సూర్య క్యాంటీన్ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వారి నుండి అపరాధ రుసుమును వసూలు చేయాలని, ఆ ఆక్రమణను వెంటనే తొలగించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. ఆ ప్రాంతంలో పారిశుధ్య విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతూ వర్షంలో విధులు నిర్వహిస్తున్న ప్పుడు ఎందుకు రైన్ కోట్లు, గ్లౌజులు వేసుకోలేదని, రైన్ కోట్లు, గ్లౌజులు ఇతర పనిముట్లు సరఫరా జరగలేదా అని కమిషనర్ ఆరా తీయగా, రైన్ కోట్లు, గ్లౌజులు అన్ని అందాయని, ఇకపై అన్ని జాగ్రత్తలతో విధులకు హాజరవు తామని కమిషనర్‌కు పారిశుధ్య కార్మికులు తెలిపారు.

శతాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని సాంప్రదాయ మత్స్యకారులు

మాజీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.యస్.చలం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: తూర్పుతీరంలో విధ్వంసం జరుగుతుందని, ఇక్కడ బతుకుతున్న మత్స్యకారులు దశాబ్దాలుగా ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదని, భారత్‌లో మూడు లక్షల కోట్ల సంపద సృష్టిస్తున్నా గత కొన్ని శతాబ్దాలుగా ఎటువంటి అభివృద్ధికి నోచుకోని ఒక సమూహం భారత్ లో ఉంది అంటే అది సాంప్రదాయ మత్స్యకారులేనని యూపీఎస్సీ మాజీ సభ్యుడు, మాజీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కేఎస్ చలం అన్నారు. హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో గురువారం వ్యవసాయ మార్కెటింగ్ పై 39వ వార్షిక సమావేశంలో ఆచార్య చలం, ప్రొఫెసర్ జి.పార్థసారథి మెమోరియల్ లెక్చర్ యిచ్చారు. దేశంలో దళిత, ఆదివాసీ గ్రూపుల్లో నమోదు చేయబడని వారు ఒక్క మత్సకారులే అన్నారు. ప్రొఫెసర్ పార్థసారథి ఆంధ్ర విశ్వవిద్యాలయం లో పనిచేసి అంతర్జాతీయ గుర్తింపు ఉన్న ఆర్థిక శాస్త్రవేత్త అని ఆచార్య చలం గుర్తు చేశారు. తూర్పు తీరం లో జరుగుతున్న విధ్వంసం వల్ల కొన్ని శతాబ్దాలుగా ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదు అన్నారు. ముఖ్యంగా ప్రపంచంలో చేపలు తినని జనాభా ఒక్క ఇండియాలోనే ఉన్నారని, భారత్ సగటున 72 శాతం అయితే రాజస్థాన్, పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో అతి తక్కువగా 30 నుండి 50 శాతం మంది మాత్రమే చేపలు తింటారన్నారు. తూర్పు తీరం లోని అస్సాం నుండి తమిళనాడు కేరళ వరకు 90 శాతం ప్రజలు ముఖ్యంగా బెంగాల్ లో బ్రాహ్మలు పశ్చిమ తీరం లో కొంకణి బ్రాహ్మలు ప్రతి రోజు చేపలు తింటారని చెబుతూ ఇలాంటి వైవిధ్యం ఉన్న దేశంలో చేపలు పట్టి అమ్ముకునే మత్స్యకారులకు ఏవిధమైన ప్రోత్సాహం, ముఖ్యంగా మార్కెట్‌కు సంబంధించి ప్రోత్సాహం లేదని చెప్పారు. రాజ్యాంగపరంగా జీవించే హక్కుగా గల మత్స్యకారులను ప్రభుత్వమే సంస్థాగత మార్పులు ద్వారా మత్స్యకారులను వారి మార్కెటింగ్‌కు కావలసిన వసతులను కల్పించాలని చెప్పారు. ఈ సమావేశానికి ప్రొఫెసర్ డి నరసింహారెడ్డి అధ్యక్షత వహించారు. ప్రొఫెసర్ శ్రీదేవి ప్రొఫెసర్ మల్లయ్య, విజయ్ సత్యనారాయణ వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన పరిశోధకులు పాల్గొన్నారు.

నకిలీ లింక్‌లు, ఫిషింగ్ కాల్స్, హానికరమైన యాప్‌లు, ఆన్‌లైన్‌లో షాపింగ్ పై ఫ్లిప్‌కార్ట్ సిఫార్సు

విశాలాంధ్ర - విశాఖపట్నం: భారతదేశంలో కోట్లాది మందికి ఆన్లైన్ షాపింగ్ సహజంగా మారుతుందని జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం కూడా అని మార్గదర్శకాలను ఫ్లిప్‌కార్ట్ అకౌంట్‌ను రక్షించుకోవడానికి, అలాగే మీ డేటా మరియు గోప్యతను భద్రపరచడానికి తీసుకోవచ్చిన సులభమైన, ప్రభావవంతమైన చర్యలను వివరించింది. అనుమానాస్పద లింక్‌ను ఎదుర్కొంటున్నా లేదా ఎలాంటి సందేహాస్పద కాల్‌ని హ్యాండిల్ చేస్తున్నా, సైబర్ భద్రతను ఎల్లప్పుడూ ఎలా కాపాడుకోవాలో ఫ్లిప్కార్ట్ వివరిస్తోంది. ఎవరైన ఫ్లిప్‌కార్ట్ నుండి కాల్ చేశారని చెప్పి, యాప్ ఇన్స్టాల్ చేయమని లేదా వ్యక్తిగత సమాచారం (ఓటిపి, పిన్, సివివి) చెప్పమని అడిగితే, వెంటనే కాల్ కట్ చేయండి. ఫ్లిప్‌కార్ట్ ఈ విధమైన వివరాలను ఎప్పుడూ అడగదు అన్నారు.

నకిలీ యాప్ లేదా వెబ్‌సైట్ సంకేతాల కోసం తనిఖీ చేయాలని, ఖాతాను బలోపేతం చేసుకోండి మరియు రక్షించుకోండి అని ఫ్లిప్కార్ట్ ప్రతినిధులు చెప్పారు. పరికరం (డివైజ్)ని చెక్ చేయండి అని, అనుమానాస్పద కార్యకలాపాలను వెంటనే తెలియజేయండి అని సూచించారు.

చందన మోహన్‌రావుకు వీవర్స్ ఫెడరేషన్ ఘన నివాళులు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఇటీవల స్వర్గస్తులైన చందన బ్రదర్స్ వ్యవస్థాపకులు వస్త్ర వ్యాపార దిగ్గజం చందన మోహనరావు పద్మశాలి వెల్ఫేర్ సంఘం నేతలు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పప్పు రాజారావు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో షాపింగ్ మాల్స్ అనే ప్రపంచాన్ని పరిచయం చేశారు అని, ఉత్తమ సంస్కారం, సామాజిక స్పృహతో నిండిన వ్యాపార దక్షత.కుటంబ సభ్యులకు అలవర్చిన ఘనత చందన మోహనరావు గారిది అని, తెలుగు రాష్ట్రాలకి 916 హాల్ మార్క్ బంగారు ఆభరణాలను పరిచయం చేసిన వ్యక్తిగా, రిటైల్ పరిశ్రమ సరికొత్త పంధానిక ఆద్యులుగా వస్త్ర బంగారు వ్యాపారములో అనేక ఆవిష్కరణలు తీసుకొచ్చిన ఘనత మోహనరావు ఉందన్నారు. ఎంతో మంది ఈ రంగాలలో ప్రవేశించడానికి ఆదర్శ ప్రయులుగా లక్షలాది మందికి ఉపాధి కల్పించిన వ్యక్తిగా, దాతృత్వ కార్యక్రమాలు ద్వారా సామాజిక సేవ నైతిక విలువలతో సమర్థవంతమైన వారసత్వాలని సృష్టించారు.మిత బాసి, మృధుస్వభవి, నిగర్వి, నిరాడంబరతకు నిలువెత్తు నిదర్శనం చందన మోహనరావు గారు, ఆయన మరణం తీరని లోటు అని ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమములో చేనేత పెద్దలు సీఎం ఆర్ షాపింగ్ మాల్ అధినేత మావూరి వెంకట రమణ , ఆంధ్రప్రదేశ్ చేనేత కులాల ప్రధాన కార్యదర్శి పప్పు రాజారావు, ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సంఘం పెద్దల కమిటీ చైర్మన్ తేడ్లపు వెంకటేశ్వర్లు , విశాఖ జిల్లా పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి కొప్పుల రామ్ కుమార్,పద్మశాలి ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ సెంట్రల్ కమిటీ సభ్యులు చిక్కా సత్యనారాయణ కరణం వెంకటేశ్వర్లు, గుదే సుశీల గజేంద్ర ,పి.వి.రమణ, వానపల్లి జగ్గారావు, డా. దుబా రాజు, కట్టా మనోజ్ కుమార్,జక్కా సూర్య ప్రకాష్, దొడ్డి రాజారావు తదితరులు పాల్గొని ఘన నివాళులు అర్పించారు.

మొంథా తుపాను బాధితులకు ఆపన్న హస్తం అందించాలి

విశాలాంధ్ర - పెందుర్తి : మొంథా తుఫాన్ బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు బిజెపి బీసీ నేత మూల వెంకటరావు విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కోస్తా జిల్లాలన్నింటి మీద తుపాన్ ప్రభావం చూపినప్పటికీ, ఎక్కువగా కోనసీమ, కాకినాడ, విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో భారీనష్టం వాటిల్లిందని తెలిపారు. తుపాన్ కారణంగా ప్రాణ నష్టాన్ని గణనీయంగా నివారించడం సానుకూల పరిణామం. గతంతో పోలిస్తే అధికార యంత్రాంగం ఈసారి మరింత అప్రమత్తంగా వ్యవహరించింది. ప్రధాన మంత్రి, ముఖ్య మంత్రి నుండి మంత్రులు వరకు మారథాన్ సమీక్షలు నిర్వహిస్తూ ఎప్పటి కప్పుడు దిశానిర్దేశం చేసారు. పౌరా మెడికల్ సిబ్బంది ప్రశంసనీయమైన కృషి చేశారు. కొందరు ఎమ్మెల్యేలు మంత్రులు ప్రజల వద్దకు వెళ్లి వారి కష్టసుఖాలు తెలుసుకుని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా బిజెపి నాయకులు, తొలి రోజు నుండి సహాయ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గోన్నారు.

వైద్యశాఖమంత్రి కేంద్ర మంత్రి దగ్గర ఉండి ఎప్పటికప్పుకు శ్రేణులుకు దిశా నిర్దేశం చేశారు. వాతావరణ శాఖ హెచ్చరికల తీవ్రత దృష్ట్యా ప్రమాద తీవ్రతను గుర్తించిన ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమై విశేష ఏర్పాట్లు చేయడం ప్రశంసనీయమన్నారు.

నేడు మధురవాడలో విద్యుత్ ఉండని ప్రాంతాలు

విశాలాంధ్ర - మధురవాడ : విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఆపరేషన్), విశాఖపట్నం బీ.సింహాచలం నాయుడు వారి సూచనల మేరకు తేదీ 31.10.2025 (శుక్రవారం) ఉదయం 09:00 గంటల నుండి మధ్యాహ్నం 02:00 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది. కొమ్మాది సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మత్తు పనులు, విద్యుత్‌తీగలను తాకుతున్న చెట్ల కొమ్మలను తొలగించే పనులు చేపడుతున్న కారణంగా ఈ దిగువ పేర్కొన్న ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జరుగుతుందని మధురవాడ విద్యుత్ కార్యాలయం గురువారం తెలిపింది. కొమ్మాది కూడలి, శ్రీనివా స నగర్, సాయిరాం కాలనీ, జి.సి.సి. లేఅవుట్, టీచర్స్ లేఅవుట్, హౌసింగ్ బోర్డు కాలనీ, అమరావతి కాలనీ, సేవానగర్, డ్రైవర్స్ కాలనీ (సాయిరాం కాలనీ), కే1 కాలనీ, కే2 కాలనీ,12. కె3 కాలనీ, కొమ్మాది గ్రామం, దేవిమెట్ట, డీఆర్కే టౌన్‌షిప్, అన్నంరాజు నగర్‌లో సరఫరా ఉండదన్నారు.

శామ్‌సంగ్ సొల్యూషన్ సాల్వ్ ఫర్ టుమారో 2025

విశాలాంధ్ర - విశాఖపట్నం: శామ్‌సంగ్, భారతదేశపు అతిపెద్ద వినియోగదారుల ఎలక్ట్రానిక్స్ బ్రాండ్, ఈ రోజు తన జాతీయ విద్యా కార్యక్రమం 'శామ్‌సంగ్ సాల్వ్ ఫర్ టుమారో 2025' యొక్క నాల్గవ ఎడిషన్ విజేతలను ప్రకటించింది. ఈ కార్యక్రమం యువ విద్యార్థులు సాంకేతికతను వినియోగించి తమ స్థానిక కమ్యూనిటీల్లోని వాస్తవ ప్రపంచ సవాళ్లకు సృజనాత్మక పరిష్కారాలను అభివృద్ధి చేయడానికి ప్రోత్సహిస్తుంది. మొదటి నాలుగు విజేత జట్లు పెర్సెవియా (బెంగళూరు), నెక్స్ట్ ప్లే డాట్ ఏఐ (ఔరంగాబాద్), పారస్పిక్ (గురుగ్రామ్) పృథ్వీ రక్షక్ (పలాము) ఐఐటి ఢిల్లీకి చెందిన ఎఫ్ ఐ ఐ ఐ టీ ల్యాబ్స్‌లో మెంటర్‌షిప్ మద్దతుతో, తమ ఆవిష్కరణాత్మక ప్రోటోటైప్లను స్కేలబుల్ రియల్ వరల్డ్ పరిష్కారాలుగా అభివృద్ధి చేయడానికి రూ. 1 కోటి విలువైన ఇంక్యుబేషన్ గ్రాంట్లు అందుకున్నారు. జ్యూరీ ప్యానెల్‌లో శామ్సంగ్ నాయకత్వం, అలాగే విద్యా సంస్థలు, ప్రభుత్వం మరియు పరిశ్రమల నిపుణులు పాల్గొన్నారు.

మహీంద్రా ఎలక్ట్రిక్ ఆరిజిన్ ఎస్‌యూవీల కోసం 'శాంసంగ్ వాలెట్'

విశాలాంధ్ర - విశాఖపట్నం: భారతదేశపు అతిపెద్ద కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ అయిన శాంసంగ్, ఈ రోజు 'శాంసంగ్ వాలెట్' ద్వారా మహీంద్రా ఎలక్ట్రిక్ ఆరిజిన్ ఎస్‌యూవీల కోసం 'డిజిటల్ కార్ కీ' సదుపాయాన్ని (కంపాటిబిలిటీ) అందిస్తున్నట్లు ప్రకటించింది. దీని ద్వారా మరింత మంది కార్ల యజమానులు తమ గెలాక్సీ స్మార్ట్‌ఫోన్‌లను ఉపయోగించి తమ వాహనాలను అన్‌లాక్ చేయడానికి, లాక్ చేయడానికి, స్టార్ట్ చేయడానికి ఒక సజావైన మార్గాన్ని పొందవచ్చు. నేరుగా గెలాక్సీ పరికరాలలో (డివైసెస్‌లో) ఇమిడిపోయే (ఇంటిగ్రేటెడ్) శాంసంగ్ వాలెట్ 'డిజిటల్ కార్ కీ', భౌతికమైన కీ (ఫిజికల్ కీ) అవసరం లేకుండానే జత చేసిన వాహనాన్ని లాక్, అన్‌లాక్, స్టార్ట్ చేయడానికి వినియోగదారులను అనుమతిస్తుంది. డ్రైవింగ్ వంటి రోజువారీ కార్యకలాపాలను మరింత మంది గెలాక్సీ వినియోగదారులకు అవాంతరాలు లేకుండా మార్చడంలో మహీంద్రాతో మా భాగస్వామ్యం మరో ఉత్తేజకరమైన ముందడుగు" అని శాంసంగ్ ఇండియా, సర్వీసెస్ యాప్స్ బిజినెస్ సీనియర్ డైరెక్టర్ మధుర్ చతుర్వేది అన్నారు. మహీంద్రా మహీంద్రా లిమిటెడ్, ఆటోమోటివ్ డివిజన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మరియు మహీంద్రా ఎలక్ట్రిక్ ఆటోమొబైల్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నళినీకాంత్ గొల్లగుంట మాట్లాడుతూ "మా ఎలక్ట్రిక్ ఆరిజిన్ ఎస్‌యూవీల వాటి అధునాతన సాంకేతికత, ఫ్యూచరిస్టిక్ డిజైన్లతో మా కస్టమర్లను ఎంతగానో ఆకట్టుకున్నాయన్నారు.

ఈవీ ఛార్జింగ్ సమీకృత మొబిలిటి కేంద్రాన్ని ప్రారంభించిన జియో బిపి

విశాలాంధ్ర - విశాఖపట్నం: బెంగళూరులోని దేవనహళ్లిలో రిటైల్ అవుట్ లెట్ లో 28 ఈవీ ఛార్జింగ్ పాయింట్లతో భారతదేశంలో మొదటి మరియు అతి పెద్ద సమీకృత మొబిలిటీ కేంద్రాన్ని ప్రారంభించినట్లు జియో-బిపి ఈరోజు ప్రకటించింది. ఇది దేశం పరిశుభ్రమైన మరియు స్మార్ట్ ప్రయాణం దిశగా దేశం యొక్క పరివర్తనలో ఒక ప్రధానమైన మైలురాయిని సూచిస్తుంది. దేవనహళ్లి అవుట్ లెట్ బహుళ-ఇంధనం రిటైల్ సైట్. ఇది పెట్రోలు, డీజిల్, సిఎన్ జీ ని అందిస్తుంది మరియు వైల్డ్ బీన్ కేఫ్. ఇది ఇప్పుడు ఆధునిక ఈ వీ ఛార్జింగ్ వేదికను చేర్చింది, 360 కే డబ్ల్యూ వరకు పంపిణీ చేసే 28 ఛార్జింగ్ పాయింట్లతో అత్యంత వేగవంతమైన డీ సీ ఛార్జర్స్ ను కలిగి ఉందని జియో బిపి ఛైర్మన్ సార్థక్ బెహూరియా తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

విశాలాంధ్ర - తగరపువలస: 33/11కెవి చిట్టివలస సబ్ స్టేషన్ నందు యార్డ్ మెయింటెనెన్స్ కొరకు శుక్రవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.సింహాచలంనాయుడు తెలిపారు. టి.నగర పాలెం, సింగనబంద, లక్ష్మీపురం మజ్జివలస, కృష్ణ రాజు పేట, నారాయణ రాజు పేట, కనకాల పేట ,అవంతి కాలేజీ , ఓక్రిడ్జ్ స్కూల్, టి నగర పాలెం హైవే, తాటితూరు గొల్లల పాలెంలో సరఫరా ఉండదన్నారు.

మార్గశిర మహోత్సవాల రాటకు ఎమ్మెల్యే వంశీకృష్ణకు ఆహ్వానం

విశాలాంధ్ర - వన్‌టౌన్: శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో వచ్చే నెలలో జరిగే మార్గశిర మాస మహోత్సవములు సందర్భంగా నవంబర్ ఒకటవ తేదీన జరిగే రాట మహోత్సవ వేడుకకు దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్‌కి ఆలయ ఈవో శోభారాణి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా నవంబర్ ఒకటో తేదీన ఉదయం 10 గంటలకు ఈ వేడుక జరగనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ మునుపెన్నడూ లేని విధంగా అమ్మవారి మార్గశిర మాస మహోత్సవములో ఘనంగా జరిగే విధంగా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ ఆనందకుమార్, ఈఈ రమణ, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

వరి పంటలను పరిశీలించిన గాడు వెంకటనారాయణ

విశాలాంధ్ర - తగరపువలస: భీమునిపట్నం మండలం సింగనబంధ గ్రామపంచాయతీ పరిధిలో తుఫాన్ కారణంగా దెబ్బతిన్న వరి పంటలను సింగన బంధ గ్రామపంచాయతీ సర్పంచ్ గాడు వెంకటనారాయణ, సింగన బంధ విఆర్‌ఓ శ్యాంసుందర్ , విలేజ్ అసిస్టెంట్ అగ్రికల్చర్ ఆఫీసర్ ప్రమీల జీఎస్ఎస్ కమ్యూనికేషన్స్ ప్రొప్రైటర్ గాడు అప్పల నాయుడు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు గణేష్, గురప్ప, శ్రీను, కేబుల్ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

డీసీపీ 1గా జగదీష్ ఆడహళ్లి

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం : విశాఖ నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో డిసిపి 1 గా జగదీష్ అడహళ్లి నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జగదీష్ ఆంధ్రప్రదేశ్ క్యాడర్ ఐపీఎస్ అధికారి. 2020లో యూపీఎస్సీ పరీక్షలో 440వ ర్యాంకు సాధించి ఐపీఎస్ అధికారి గా ఎంపిక అయ్యారు. అతను మొదట్లో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేశారు, ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో అనేక హోదాల్లో పనిచేశారు. ప్రస్తుతం ఆయన అల్లూరి జిల్లా ఏ ఎస్ పి గా పనిచేస్తూ విశాఖ డీసీపీ -1 గా బదిలీ అయ్యారు.